# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

శుక్రవారం | 19 |జూన్ | 2026 | పేజీలు: 10


### 20న ఉండవల్లి గుహల వద్ద ముఖ్యమంత్రి యోగా



9లో



# జై యోగాంధ్ర.. జైజై యోగాంధ్ర..

5లో

పి.మీరాహుస్సేన్ ఖాన్

- విజయవాడ, మనంబ్యూరో

అధికారుల్లో ఉత్సాహం నింపిన కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన కలెక్టర్ లక్ష్మీశ

అంతర్జాతీయ యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

### ఎస్సీ యువత సాధికారతకు

# పీఎం అజయ్

నైపుణ్య శిక్షణతో సుస్థిర ఉపాధికి బాటలు

ఈ నెల 19న నందిగామ, 20న తిరువూరులో మేళాలు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

4లో



## 25 ప్రగతి సూచికల్లో 100 శాతం ప్రగతి

మిగిలిన 13 సూచికల్లోనూ సత్వర అభివృద్ధికి చర్యలు

మహిళా సాధికారతకు సరికొత్త వేదిక గుంటుపల్లి రైజ్

ఇబ్రహీంపట్నం బ్లాకులో పర్యటించిన కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు

4లో




## రైతుల ఆదాయ వృద్ధే ప్రభుత్వ లక్ష్యం

8లో



సుస్థిర వ్యవసాయ విధానాల అమలుకు సమన్వయంతో ముందుకు సాగాలి

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

# వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్



**జగ్గయ్యపేట జూన్ 18 మనం న్యూస్:** జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, 02 వ స్వర్ణ వార్డ్ నందు మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ రావు, గురువారం విజిట్ చేసి, స్వర్ణ వార్డు సచివాలయ కార్యదర్శుల పనితీరుపై రివ్యూ చేసియున్నారు. సచివాలయమునకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేస్తూ రిజిస్టర్లు క్రమ పద్ధతిలో నిర్వహించవలెనని, ప్రతి సెక్రటరీ బాధ్యతతో పనిచేయవలెనని, సచివాలయ సిబ్బందికి ఏదైనా సర్వేలు ఉన్నప్పుడు అందరూ స్నేహభావంతో ఉంటూ నిర్ణిత సమయములో పూర్తి చేయవలెనని, ప్రతి సెక్రటరీ అన్ని విషయములపై అవగాహన కలిగి ఉండవలెనని ఆదేశించారు. స్వర్ణ వార్డునకు వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారు ఏ పని మీద వచ్చి ఉన్నారో ఆ పని పూర్తి చేసి పంపవలెనని ఆదేశించినారు. ఈ మధ్య వచ్చిన ఒంటరి మహిళ పెన్షన్ పై వచ్చిన గ్రీవెన్స్ కు సంబంధించి ఫిర్యాదుదారునకు స్వయంగా ఫోన్ చేసి ఆమెతో సదరు గ్రీవెన్స్ పై వివరణ తెలిపియున్నారు. అలాగే రేపు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే డేటా ప్రజలకు అందుబాటులో ఉంచి వార్డు సభ నిర్వహించవలెనని సచివాలయ సిబ్బందికి ఆదేశములు జారీ చేశారు.

# సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన ఆరోగ్య కరమైన ఆహార ఉత్పత్తులు




**▶▶ సేంద్రీయ వ్యవసాయ అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**

**జగ్గయ్యపేట, జూన్ 18 మనం న్యూస్:** సేంద్రియ వ్యవసాయం ద్వారా భూమి సహజ సారాన్ని కాపాడుకోవడంతోపాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పొందవచ్చునని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. జగ్గయ్యపేట మండలం, గరికపాడు వద్ద గల డా. కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సేంద్రీయ పద్ధతుల ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడంతో పాటు మానవ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూమి సహజ సారాన్ని కాపాడుకోవడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పొందవచ్చని వివరించారు. రైతులు సంప్రదాయ వ్యవసాయ విధానాలతో పాటు ఆధునిక సేంద్రీయ సాంకేతికతలను అవలంబించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. పశువుల ఎరువు, జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు.సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతుల ఆదాయం కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయా భివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ వివిధ పథకాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల అభ్యున్నతికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు అందిస్తున్న సూచనలు, సలహాలను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిషాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోసాని గురునాథం, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ కసుకుర్తి శ్రీనివాసరావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డు మల్లికార్జున్, మన్నె శ్రీనివాసరావు, వక్కంతు సుధాకర్,కీసర రాంబాబు, కోవెలమూడి వెంకటేశ్వరరావు, పగడాల శ్రీనివాసరావు, బొమ్మ దేవర శ్రీనివాసరావు, అన్నెపాగ ప్రపుల్ల శ్రీకాంత్, కల్లూరి శ్రీవాణి,వక్రమ్ ,మన్నె మాధవి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ గంగాభవాని-పోతురాజుల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తన్నీరు



**జగ్గయ్యపేట జూన్ 18 మనం న్యూస్:** జగ్గయ్యపేట నియోజకవర్గం జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో శ్రీ గంగాభవాని - పోతురాజు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు - సతీమణి తన్నీరు సుధారాణి లు పాల్గొన్నారు. గురువారం జరిగిన ఈ ప్రతిష్ట మహోత్సవాలలోముందుగా శ్రీ గంగాభవాని అమ్మవారు మరియు పోతురాజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మహోత్సవ కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల అభివృద్ధి పౌర సేవల కల్పన ప్రభుత్వ లక్ష్యం

**▶▶ జగ్గయ్యపేట బ్రాహ్మణ బజార్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పర్యటన**



**జగ్గయ్యపేట జూన్ 18 మనం న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం, వార్డుల అభివృద్ధి మరియు మెరుగైన పౌర సేవల కల్పన లక్ష్యంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర 20వ వార్డులోని బ్రాహ్మణ బజార్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తో కలిసి స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలు మరియు అభివృద్ధికి సంబంధించిన సూచనలను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్డు నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై ప్రజలు తెలిపిన సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఈ సందర్భంగా శాసనసభ్యులు తెలిపారు. ఇంటింటికీ చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు 10 ఈ-ఆటోలను కొనుగోలు చేయడంతో పాటు, 20 పుష్ కార్టులను కూడా సమకూర్చే ప్రక్రియలో మున్సిపాలిటీ ఉందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా పట్టణంలో పారిశుద్ధ్య ప్రమాణాలు మరింత మెరుగుపడి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి వార్డును సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ పి వీ వీ డి ప్రసాద్, కౌన్సిలర్ గొట్టే నాగరాజు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి చిన్న, కోటగిరి సుధాకర్, మద్దుల ఉమా, పారేపల్లి సూరిబాబు, షేక్ మాబ్ మియా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**పామర్రు, జూన్ 18( మనం న్యూస్):**మండల పరిధిలో ని కనుమూరు అంగన్వాడీ 1,2కేంద్రాల్లో గురు వారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ముఖ్య అతిదులు గా ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ నరేంద్ర, సచివాలయ సంక్షేమ అధికారి రాజులపాటి స్రవంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,చిన్నారుల ఉజ్వల భవిష్యత్కు అంగన్వాడీ కేంద్రాలే పునాదులని అన్నారు. బాల్య విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రాల నిర్వహకులు పి పుష్పావతి, కే ప్రసన్న, సిబ్బంది శోభకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పామర్రు అంగన్వాడీ కేంద్రలో ఘనంగా గ్రాడ్యుయేషన్ సెలెబ్రేషన్స్

**పామర్రు జూన్ 18 ( మనం న్యూస్):** పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గల అంగన్వాడీ కేంద్రలో గురు వారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాాలో ఐదేళ్ల లోపు అక్షరాభ్యాసం పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. పర్యవేక్షకురాలు సత్య శ్రీ నూతక్కి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్వాడీ సెంటర్ల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడమే గ్రాడ్యుయేషన్ డే ప్రాముఖ్యత అని వివరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు గ్రేడ్లు ప్రకటించాం. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అంగన్వాడీ సెంటర్లలో ప్లే స్కూల్ విద్యను మరింత బలోపేతం చేయాలని టీచర్లకు సూచించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్లే స్కూల్ కోసం అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమాాలో అంగన్వాడి టీచర్లు బి. పద్మజారాణి ఎస్. జయలక్ష్మి కె.రత్నశ్రీ తో పాటు హెల్పర్లు పాల్గొన్నారు.



# ప్రజల ఆదరణతోనే బొండా ఉమాన్నకు ప్రత్యేక గుర్తింపు



**ఎన్డీయే రెండేళ్ల విజయోత్సవ సభలో కొనియాడిన కూటమి నాయకులు**

**విజయవాడ సెంట్రల్ , జూన్ 18 (మనం న్యూస్)ః** ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, అభివృద్ధి కార్యక్రమాలకు వేగం తీసుకొచ్చిన నాయకుడిగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక గుర్తింపు పొందారని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నగరంలోని ఐవీ ప్యాలెస్లో బొండా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభలో పలువురు నాయకులు ఆయన సేవలను ప్రశంసించారు.సభలో మాట్లాడిన నాయకులు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం అంటే బొండా ఉమన్న, బొండా ఉమన్న అంటే ప్రజల నమ్మకం అనే స్థాయికి ఆయన ఎదిగారని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీపడకుండా పోరాడటంతో పాటు, అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు.పేదల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం, అవసరమైన వారికి సహాయం అందించడం, యువతకు అవకాశాలు కల్పించడం, ప్రతి డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా బొండా ఉమన్న గుర్తింపు పొందారని అన్నారు.ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడు బొండా ఉమామహేశ్వర రావు అని కొనియాడారు. పార్టీ కష్టకాలంలో కార్యకర్తలకు ధైర్యంగా అండగా నిలిచిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.అనంతరం బొండా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గత రెండేళ్లలో సంక్షేమం, మౌలిక వసతులు, పరిశ్రమలు, పెట్టుబడులు, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, అదే స్ఫూర్తితో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూజీడీ, స్టామ్వాటర్ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**రూ.50 లక్షలతో డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శంకుస్థాపన**



**విజయవాడ తూర్పు జూన్ 18 (మనం న్యూస్)ః** తూర్పు నియోజకవర్గంలో యూజీడీ, స్టామ్వాటర్ సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి నారా చంద్రబాబ ునాయుడు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి మరిన్ని నిధులు మంజూరు చేయించి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు.గురువారం 13వ డివిజన్ కోనేరు వారి వీధి పాలకేంద్రం బజారులో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న యూజీడీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే 90 శాతం రహదారుల పునర్నిర్మాణం పూర్తయిందని, ప్రస్తుతం డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.డ్రైనేజీ సమస్యలకు పలు కారణాలు ఉన్నాయని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే 13వ డివిజన్లో రూ.50 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులు చేపట్టినట్లు వెల్లడించారు.2014-19 మధ్య కేంద్ర మాజీ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు సహకారంతో స్టామ్వాటర్ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం రూ.450 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అందులో రూ.250 కోట్లు ఖర్చు చేసి పలు ప్రాంతాల్లో పనులు నిర్వహించామని చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మిగిలిన నిధులను ఏ అవసరాలకు వినియోగించిందో స్పష్టత లేదని విమర్శించారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మళ్లీ కేంద్రాన్ని ఒప్పించి స్టామ్వాటర్ నిధులను తీసుకువచ్చి మిగిలిన పనులు పూర్తి చేసే దిశగా కృషి చేస్తోందని తెలిపారు. యూజీడీ, స్టామ్వాటర్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని మున్సిపల్ కమిషనర్తో చర్చించి రూ.50 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతి శ్రీను, శివాజీ, వేములపల్లి శ్రీను, గుమ్మడి కృష్ణారావు, బొత్తుల శ్రీను, చిట్టిబాబు, నాగేశ్వరరావు, మాదిరెడ్డి రవి, కణ రమేష్, గరికపాటి బద్రి, రాధారపు యల్లబాబు, గల్లా రవి, యార్లగడ్డ సునీల్, కంతమనేని మానస, ముమ్మనేని మానస, దూళిపాళ్ల రాజేష్, కల్పన, ఉషారాణి, కొండలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బి ఎల్ ఎ లు అందరూ సమర్ధవంతంగా పని చేయాలిః లంక లితీష్



**మైలవరం జూన్ 18 మనం న్యూస్ :**స్థానిక మండలం లోని పెద్ద హరిజనవాడ, దేవుని చెరువు లో గల 92, 93, 99 బూతుల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు మైలవరం లో జరుగుతున్న ఓటర్ సమగ్ర సర్వే కార్యక్రమం లో బి ఎల్ ఎ లతో కలిసి సమగ్ర ఓటర్ సర్వేను పరిశీలించిన నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఎల్ ఎ అందరూ ఓటర్ సమగ్ర సర్వే కార్యక్రమాన్ని అందరూ సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు, బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

# విద్యాశాఖ అధికారుల నిర్లక్షమే అధిక ఫీజులు వసూళ్లకు కారణం




**బుక్స్, యూనిఫారమ్స్ వ్యాపార కేంద్రంగా విద్యాసంస్థలుగుర్తింపు లేకుండా కాలేజీ నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

**విద్యాశాఖ అధికారులకు సవాళ్లు చేస్తున్న ప్రైవేట్ స్కూల్ యాజమని**

**మైలవరం జూన్ 18 మనం న్యూస్ :**స్థానిక ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కార్పోరేట్, ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూళ్ళు, పుస్తకాల అమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మరియు జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలలో, మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూళ్ళు, పుస్తకాల అమ్మకాలకు కారణం అవుతున్నాయని ఆయన అన్నారు, మండలంలో శ్రీ చైతన్య, నారాయణ, వివేకానంద పాఠశాలల్లో అడ్డగోలుగా పుస్తకాలు యూనిఫాములు అమ్ముతున్నారని రెండు రోజులుగా ఎస్ఎఫ్ఐ ఆందోళన చేస్తున్న స్థానికంగా ఉన్న ఎంఈఓ రూములకు తాళాలు వేశారు, అయినప్పటికీ పక్కనుండి పుస్తకాల వ్యాపారం కొనసాగుతూనే ఉందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని అన్నారు, కొన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఎంఈఓ లను బేకాతర చేస్తూ విద్యార్థి సంఘాలను సైతం మీ చేతనైనది చేసుకోండి అంటూ సవాల్ చేస్తూ పుస్తకాలు అమ్ముతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి జోక్యం చేసుకోవాలని లేని పక్షంలో కలెక్టర్ సమక్షంలో విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ గా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు, మండల కేంద్రంలో రిసోనన్స్ కాలేజీ పేరుతో గత ఏడాది కాలంగా ఎటువంటి గుర్తింపు లేకుండా విజయవాడ, తిరువూరులో కూడా బ్రాంచ్ లు ఉన్నట్లు పాంప్లెట్స్, బ్యానర్స్, ముద్రించి అత్యంత దుర్మార్గంగా అడ్మిషన్లు చేసి 30 వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని, టీషర్టు యూనిఫార్మాలుగా పెట్టి ప్రచారం చేస్తున్నారని అన్నారు. దీనిపై ఎస్ఎఫ్ఐ పోరాటంతో తిరిగి పాత కాలేజీ నే కొనసాగించేందుకు అంగీకరించారని ఎస్వీఆర్ జి కాలేజీని కొనసాగించాలని తక్షణమే బోర్డులు తొలగించాలని, ఎవరైతే తప్పు పద్ధతులలో కళాశాలను నడుపుతున్నారో కళాశాల యాజమాన్యంపై ఆర్ఐఓ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ అనిల్ కుమార్, కె సురేష్, ఎం చరణ్ తేజ్, హర్ష, దేవేంద్రనాథ్ పాల్గొన్నారు.

# హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు అవగాహన

**ధ్యానం యొక్క ఆవశ్యకత, ప్రయోజనాలు, ఒత్తిడి నిర్వహణ, మానసిక ప్రశాంతత, విధి నిర్వహణలో ఏకాగ్రత పెంపు, ఆరోగ్య కరమైన జీవన విధానం వంటి అంశాలపై**



**మైలవరం జూన్ 18 మనం న్యూస్ః**పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ రూరల్ లక్ష్మీనారాయణ, ఐపీఎస్ సూచనలతో, ఏసీపీ ఆధ్వర్యంలో స్థానిక సర్కిల్ పోలీసు సిబ్బందికి హార్ట్ ఫుల్నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యాన (మెడిటేషన్) కార్యక్రమం ప్రారంభించ బడింది. ఈ కార్యక్రమం ఎల్బీఆర్సీఈ టీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రారంభమై మూడు రోజుల పాటు నిర్వహించబడనుంది. కార్యక్రమంలో భాగంగా ధ్యానం యొక్క ఆవశ్యకత, ప్రయోజనాలు, ఒత్తిడి నిర్వహణ, మానసిక ప్రశాంతత, విధి నిర్వహణలో ఏకాగ్రత పెంపు, ఆరోగ్య కరమైన జీవన విధానం వంటి అంశాలపై హార్ట్ఫుల్నెస్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. పోలీసు విధుల్లో ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళనలను తగ్గించు కోవడంతో పాటు విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పని చేయడానికి ధ్యానం దోహద పడుతుందని ఈ సందర్భంగా వివరించారు. పోలీసు సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. కిషోర్ బాబు, ఎస్ఐలు సుధాకర్, సతీష్, శ్రీను, గిరి సాయి, గిరిజామణి మరియు ఇతర పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 60 మంది పాల్గొన్నారు.

# 25 ప్రగతి సూచికల్లో 100 శాతం ప్రగతి




**▸▸ మిగిలిన 13 సూచికల్లోనూ సత్వర అభివృద్ధికి చర్యలు**

**▸▸ మహిళా సాధికారతకు సరికొత్త వేదిక గుంటుపల్లి రైజ్**

**▸▸ ఇబ్రహీంపట్నం బ్లాకులో పర్యటించిన కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు**

విజయవాడ రూరల్, జూన్, 18,(మనం న్యూస్)ః ఎన్టీఆర్ జిల్లాలో ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం ఆకాంక్షిత బ్లాకులను ఆదర్శ బ్లాకులుగా తీర్చదిద్దేందుకు సమష్టిగా కృషిచేయడం జరుగుతోందని.. ఇబ్రహీంపట్నంలో సంతృప్తి స్థాయికి తీసుకెళ్లాల్సిన 38 సూచికల్లో ఇప్పటికే 25 సూచికల్లో 100 శాతం పురోగతి సాధించినట్లు కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్బాబు తెలిపారు. వీలైనంత త్వరగా మిగిలిన 13 సూచికల్లోనూ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేస్తున్నట్లు వెల్లడించారు.నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్, కేంద్ర ప్రభారీ అధికారి అశోక్బాబు గురువారం ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. కొటికలపూడిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. మూలపాడులోని ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టిన మునగ, నిమ్మ ప్లాంటేషన్ ప్రాంతాలను, బటర్ఫ్లై పార్కును సందర్శించారు. కొండపల్లిలో ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలతో పాటు గుంటుపల్లిలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని సందర్శించి.. మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేసేందుకు అమలు చేస్తున్న వినూత్న శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం అశోక్బాబు ఎంపీడీవో కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, మానవాభివృద్ధి సూచికల్లో ప్రగతి సాధించేలా గౌరవ ప్రధాని దార్శనికతకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా 500కు పైగా బ్లాక్లను కేంద్రం ఆకాంక్షిత బ్లాకులుగా ప్రకటించిందని.. ఇందులో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 15 బ్లాకులు ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాక్లు/మండలాలు ఉన్నాయన్నారు. మిగిలిన మండలాలతో సమానంగా ప్రగతి సాధించేలా ప్రత్యేక దృష్టిపెట్టి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం జరుగుతోందన్నారు. ఇంటింటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా, గృహనిర్మాణం వంటి వాటికి సంబంధించిన సూచికల్లోనూ సంతృప్తికర స్థితికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కీలక ప్రగతి సూచికల్లో పురోగతిని ఎప్పటికప్పుడు మదిస్తూ.. మెరుగైన ప్రణాళికలను అమలుచేస్తూ ముందుకెళ్తున్నామని, ఈ దిశగా అడుగులు వేస్తూ ఏవైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే గుర్తించి సత్వరం పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ వారి సారథ్యంలో బ్లాకు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి అన్ని సూచికల్లో ప్రగతి దిశగా తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. స్థానిక అధికారులతోనూ సమన్వయం సమావేశం నిర్వహించామని, అన్ని సూచికల్లోనూ ముందడుగు వేసేందుకు అనురించాల్సిన ప్రణాళిక, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు అశోక్బాబు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శకుంతల జి కొండూరు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ , డిప్యూటీ ఎంపీడీవోలు వి.మనోజ్, బి.ప్రసాద్, బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈవో పుష్పలత, సీడీపీవో పుష్పలత, [illegible] నాచారరావు, [illegible] గ్రౌండ్ వాటర్ నాగ మల్లేశ్వరరావు, [illegible] మైలవరం జు రవి కుమార్, [illegible] హౌసింగ్ పిచ్చయ్య, స్థానిక మండల అధికారులు సరిత, నాగరాజు, ఫర్హీన్, శోభన్బాబు, స్వాతి, రజని తదితరులు పాల్గొన్నారు.








# ఎస్సీ యువత సాధికారతకు పీఎం అజయ్

**నైపుణ్య శిక్షణతో సుస్థిర ఉపాధికి బాటలు**

**ఈ నెల 19న నందిగామ, 20న తిరువూరులో మేళాలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,జూన్, 18,(మనం ప్రతినిధి)ః పీఎం అజయ్ పథకం ద్వారా నిరుద్యోగ ఎస్సీ యువతీయువకులకు ఆసక్తిగల రంగాల్లో నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవగాహన సదస్సులు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ సదస్సులు ఎస్సీ యువత సాధికారతకు పునాదులు వేస్తాయని పేర్కొన్నారు. గురువారం కలెక్టరట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో పీఎం అజయ్-అవగాహన సదస్సుల నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 19న నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో, 20న తిరువూరు ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు అవగాహన సదస్సు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మేళాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేళాల్లో ఎస్సీ యువతకు ఆసక్తి ఉన్న రంగాలు, వారికి అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలు, అందుబాటులో ఉన్న పథకాలు, బ్యాంకు లింకేజీ వంటి వనరులు తదితరాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. జిల్లా పరిషత్, సాంఘిక సంక్షేమం, సాధికారత శాఖ, డీఆర్డీఏ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి తదితర సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేసి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జి.రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి హర్షిత, నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలు

**▸▸ గుంటుపల్లి డాన్బోస్కో స్కూల్ వేదికగా నిర్వహణ**

**▸▸ ఆరోగ్యం, క్రమశిక్షణ, ఏకాగ్రతకు యోగానే మార్గమని చాటిన పోటీలు**

**▸▸ రాష్ట్రస్థాయి అధికారులతో పాటు పాల్గొన్న కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,జూన్,18,(మనంన్యూస్)ః యోగాంధ్ర-2026లో భాగంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయని ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 800 మంది పాల్గొంటున్నారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి డాన్బోస్కో స్కూల్లో రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి డా. సుజాత, పోటీల రాష్ట్ర నోడల్ అధికారి డా. ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పోటీల తీరుతెన్నులను పరిశీలించారు. పోటీల్లో పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈ పోటీలు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్తో జరుగుతున్నాయన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని వివరించారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు జరుగుతున్నాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉన్నాయన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్, యంగ్, సీనియర్ గ్రూప్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సాఫీగా సర్ ఇంటింటి సర్వే..

**▸▸ బీఎల్వోల ద్వారా 2,74,614 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**

**▸▸ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రక్రియ వేగవంతానికి నిరంతర పర్యవేక్షణ**

**▸▸ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,జూన్, 18,(మనం న్యూస్)ః భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ-సర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే సాఫీగా జరుగుతోందని.. ఇప్పటివరకు బీఎల్వోల ద్వారా 2,74,614 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 17,13,445 మంది ఓటర్లు ఉన్నారని.. బీఎల్వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంతో పాటు వాటిని నింపి తిరిగి ఇవ్వడంలో సహకరిస్తున్నారన్నారు. అదేవిధంగా 10,870 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిలా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు కీలకపాత్ర పోషించేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సగటున ఒక్కో బీఎల్వో పరిధిలో 956 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా జులై 14వ తేదీ వరకు బీఎల్వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందిస్తారని.. నింపిన వాటిని తిరిగి సేకరిస్తారని, ఇందుకు ప్రతి ఇంటికీ కనీసం మూడుసార్లు వెళ్లనున్నారని తెలిపారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా కార్యక్రమంలో పాల్గొని బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.







# జై యోగాంధ్ర..
# జైజై యోగాంధ్ర..

**అధికారుల్లో ఉత్సాహం నింపిన కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర**

**ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన కలెక్టర్ లక్ష్మీశ**

**అంతర్జాతీయ యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు**







**(విజయవాడ,మనం బ్యూరో):** ఈ నెల 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత, పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సమన్వయ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ తో పాటు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, రవాణా, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించారు. వేలాదిగా యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొననున్నందున ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏర్పాట్ల వివరాలను సమావేశంలో సవివరంగా వివరించారు. గ్యాలరీల ప్రణాళిక, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, వైద్య సేవలు, అంబులెన్సులు, అత్యవసర స్పందన బృందాల నియామకం, రవాణా, అగ్నిమాపక ఏర్పాట్లు వంటి అంశాలపై చేపడుతున్న చర్యలను వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రతిష్ఠాత్మకంగా, సజావుగా, భద్రతాయుతంగా జరిగేలా అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఏర్పాటును క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నట్లు సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, యోగా గురువు బాబా రాందేవ్ బృంద సభ్యులు, సమన్వయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# పరీక్షలో ప్రతి దశా నీట్‌గా ఉండాల్సిందే!

**అజాగ్రత్త అనేది మచ్చుకైనా కనిపించకూడదు**

**ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

**విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**నీట్ పరీక్ష సమన్వయ సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,జూన్,18,(మనం ప్రతినిధి):** దేశ వ్యాప్తంగా ఈ నెల 21న నీట్ (యూజీ) - 2026 పునఃపరీక్ష జరగనున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహణలోని ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని అధికారులను కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నీట్ పరీక్ష నిర్వహణపై సమన్వయ సమావేశం జరిగింది. కో ఆర్డినేటర్లు, అబ్జర్వర్లు, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు తదితరులు హాజరైన ఈ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ హాజరై పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ప్రతి దశ అత్యంత కీలకమని.. ప్రశ్నపత్రాల భద్రత నుంచి పరీక్ష ముగిసే వరకు అన్ని ప్రక్రియలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 31 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో పరీక్షకు మూడు గంటల సమయం ఉండగా.. ఈసారి 15 నిమిషాలు అదనపు సమయం అందుబాటులో ఉంటుందని.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. బయోమెట్రిక్ తీసుకోవడంలో విద్యార్థులకు చిన్నపాటి అసౌకర్యం కూడా కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత, భద్రత, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు కూడా అదే రోజున జరగనున్నందున పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రవాణా, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, స్మార్ట్ వాచ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని పేర్కొన్నారు. ప్రతి గదిలో గోడ గడియారం తప్పనిసరిగా ఉంటుందన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నీట్ కోఆర్డినేటర్లు డా. ఎం.గోపీకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


# నందిగామలో పత్రికా ప్రతులు దగ్ధం



**నందిగామ,జూన్(మనం న్యూస్):** నందిగామలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు ఓ పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపాయి. వైసీపీ పాలనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తూ నైతిక విలువలు లేని జర్నలిజం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కూటమి ప్రభుత్వ వైఫల్యాలను విస్మరించి అసత్య కథనాలు రాస్తున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడంలో మీడియా బాధ్యతగా వ్యవహరించాలని మొండితోక సూచించారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల వివరాలు తప్పనిసరి

**డీవైఈవో గురునాథం**



**నందిగామ,జూన్18(మనం న్యూస్):** ప్రైవేట్ పాఠశాలల్లో నోటీస్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీవైఈవో గురునాథం సూచించారు. విద్యార్థుల చదువును బట్టి ఫీజుల వివరాలు, మొత్తం విద్యార్థుల సంఖ్య స్పష్టంగాప్రదర్శించాలన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## శ్రీ విఘ్నేశ్వర స్వామి 12వ వార్షిక కళ్యాణ మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం



**నందిగామ,జూన్18(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వెలసిన శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో 12వ వార్షిక కళ్యాణ మహోత్సవాల ఏర్పాట్లు ఘనంగా పూర్తి అయ్యాయి. శుక్రవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, ప్రత్యేక అలంకరణలు, విశేష అర్చనలు నిర్వహించనున్నారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. సాయంత్రం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అన్నవరపు తిరుపతిరావు మాట్లాడుతూ, స్వామివారి పవిత్ర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీర్వాదాలు పొందాలని కోరారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## రాష్ట్రంలో కూటమి పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయి

- **రక్షించాల్సిన పోలీసులే భక్షక భటులుగా మారారు**
- **వైసిపి పట్టణ అద్యక్షుడు వేమా సురేష్ బాబు**




**కంచికచర్ల,జూన్18(మనం న్యూస్):** ప్రభుత్వం, పోలీసులు కలిపి అమాయక యువతను బలి చేస్తున్నారన్నారు. విజయవాడ లో సాయికృష్ణ అనే కాపు యువకుడిని కృష్ణలంక సి ఐ నాగరాజు పోలీస్ స్టేషన్ కు పిలిపించి లాకప్ డెత్ చేయటమేకాకుండా, బాడిని కూడా కనబడకుండా చేయటం దారుణమన్నారు. ముఖ్యంగా కాపుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రాష్ట్ర వ్యాప్తంగా, కాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు నోరు మెదపకపోవటం అన్యాయమన్నారు. గతంలో కందుకూరులో కాపు యువకుడిని హత్య చేసిన ఘటన కూడా కూటమి పాలనలో టిడిపి నేతల ప్రొద్బలంతోనే జరిగిందన్నారు. ఆనాడు కూడా ఒక కాపు గా ఉన్న పవన్ కళ్యాణ్ స్పందించలేదన్నారు..., ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి సామాజిక వర్గం అంటే కూటమి పాలనలో ఎంతటి ప్రాధాన్యత ఉందో ఈ ఉదంతాలే నిదర్శనమన్నారు. కాపుల ఓటుతో కూటమి పాలనలో ఉప ముఖ్యమంత్రి గా ఉన్న పవన్ కళ్యాణ్ విజయవాడ లో సాయికృష్ణ లాకప్ డెత్ ఘటనపై ఇంత వరకు ఎందుకు స్పందిఃచలేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ పిలుపుతోనే గత ఎన్నికల్లో కాపులు కూటమికి పట్టం కట్టారన్నారు. రాష్ట్రం లో ఎక్కడా కాపులకు అన్యాయం జరిగినా పవన్ నోరు మెదపటంలేదన్నారు. లాకప్ డెత్ కు గురైన సాయికృష్ణ కుటుంబం జనసేన పార్టీకి చెందినవారేనని, సొంత పార్టీ కాపులకు జరిగిన అన్యాయం గురించి స్పందించలేని పవన్ కళ్యాణ్ ఇక కాపులను కాదుగా, రాష్ట్ర ప్రజలను ఏంఉద్ధరిస్తాడని విమర్శించారు. తక్షణమే లాకప్నడెత్ చేసిన సి ఐ ను విధుల నుండి తప్పించటమే కాకుండా, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత 40 ఏళ్ళు గా రాష్ట్రం లో ముఖ్యంగా టిడిపి అధికారం లో ఉన్న ఎంతో ఘన చరిత్ర కలిగిన కాపు నేతలను పొట్టనబెట్టుకున్నారని ఆరోపించారు. మరో పక్క మహిళలను కించ పరిస్తే ఊరుకునేది లేదన్న పవన్ గతంలో మాజీ మంత్రులు రోజా, విడుదల రజని లపై నోటికి పట్టనట్లు బూతులుతో, వ్యక్తి గతంగా అనరానిమాటలు అన్న టిడిపి నాయకులు వ్యాఖ్యలు పవన్కళ్యాణ్ కు గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. మాజీ మంత్రి అమరనాథ్, హోంమంత్రిని ఏదో అన్నాడని ఇప్పుడు పవన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అమర్ నాధ్ ఎవరిని ఉద్దేశించి అనలేదన్నారు. దీనికి స్వంత పార్టీలోని హోంమంత్రిని అనవసరంగా బయటకు లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకా ఎన్నాళ్ళు ఇలా కాపు బిడ్డలను బలి తీసుకుంటారు. మీకు త్వరలో కాపు పవర్ చూపిస్తాము అని తెలియచేసారు.

## పలువురు వైఎస్ఆర్ పార్టీ నాయకులను పరామర్శించిన డాక్టర్ మొండితోక జగన్మోహనరావు



**కంచికచర్ల,జూన్18(మనం న్యూస్):** కంచికచర్ల పట్టణం లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్ లో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కాలవ పెద్దబాబుని, పార్టీ నాయకులు జిల్లా హనుమంతురావు తండ్రి సాంబశివరావుని,నాయకులు పెరంచర్ల నాగేశ్వరరావుని పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి, వారి మెడికల్ రిపోర్ట్ లను పరిశీలించి తగు సూచనలు చేసిన మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు.

## ఇంద్రకీలాద్రి విస్తరణకు భూసేకరణపై కసరత్తులు



**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 18 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం విస్తరణ పనులను వేగవంతం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు గురువారం దేవస్థాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భూసేకరణ పరిధిలోకి వచ్చే గృహ నిర్వాసితులతో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనా నాయక్, విజయవాడ ఆర్డీఓ వెన్నెల శ్రీను తదితరులు ముఖాముఖి చర్చలు జరిపారు.ఆలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వసతులు విస్తరించేందుకు అర్జున వీధిలో 5 గృహాలు, మల్లికార్జునపేట ఉత్తర మెట్ల ప్రాంతంలో 12 గృహాలు, కొండపై ప్రాంతంలో 5 గృహాలను భూసేకరణ కోసం ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సమావేశానికి హాజరైన నిర్వాసితులు తమ అభిప్రాయాలు, విజ్ఞప్తులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ, భూసేకరణ ప్రక్రియలో నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే సంబంధిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్కు సమర్పించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో దేవాదాయ శాఖ, రెవెన్యూ, ఆర్అండ్బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ యొక్క ప్రాముఖ్యత చాలా అవసరం



- **దుగ్గిదేవి గోపికృష్ణ**

**నందిగామ,జూన్18(మనం న్యూస్):** ఎస్ఐఆర్( స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్)కార్యక్రమంలో భాగంగా నందిగామ శివారు అనాసాగరం 104 బూత్ నందు వోటర్ వెరిఫికేషన్ ఫారాలను బూత్ లెవెల్ ఆఫీసర్ పాపట్ల కృష్ణ , దుగ్గిదేవి గోపి కృష్ణ ఆధ్వర్యంలో ఓటర్స్ కు అందచేసి వెరిఫికేషన్ ఫారాలను ఏ విధంగా రాయాలి అని అవగాహన కల్పించి 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్త ఓట్లు చేరికలు రాసుకోవడం జరిగినది.

## రైతుల ఆదాయ వృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**సుస్థిర వ్యవసాయ విధానాల అమలుకు సమన్వయంతో ముందుకు సాగాలి**

**కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఉద్ఘాటన**



**గుంటూరు, జూన్ 18 : (మనం న్యూస్ ప్రతినిధి):** రైతుల ఆదాయం పెంచడమే వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల అంతిమ లక్ష్యం కావాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.గురువారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ తో కలసి సుస్థిర వ్యవసాయ విధానం మరియు వ్యవసాయ అనుబంధ విభాగాల పనితీరుపై ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి, ఆధునిక సాగు పద్ధతుల ప్రోత్సాహం, పంటల వైవిధ్యీకరణ, ఉద్యానవన శాఖలతో సమన్వయం వంటి అంశాలపై మంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో మరింత విస్తృతంగా వినియోగిస్తూ,ఉత్పాదకత పెంపుతో పాటు రైతుల జీవనోపాధి మెరుగుపడేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సుస్థిర వ్యవసాయ విధానాల ద్వారా ప్రకృతి వనరుల పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు అనుకూలమైన వ్యవసాయ వ్యవస్థను నిర్మించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.రైతు సంక్షేమం, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కేంద్ర మంత్రి అన్నారు.తెగుళ్ల ను తట్టుకునే విధంగా నూతన విత్తన వంగడాల అభివృద్ధికి కృషి చేయడం,మూడో పంట వేసేందుకు రైతులను సమాయత్తం చేయడం, నియోజకవర్గ స్థాయిలో వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, ప్రతి మండలంలో డ్రోన్ పైలట్ శిక్షణను అందివ్వడం వంటి కార్యక్రమాలతో వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా చేస్తామన్నారు.ఈ సమావేశంలో ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ పి వి సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రత్యేక పర్యవేక్షణ



**నందిగామ,జూన్18(మనం న్యూస్):** స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్)కార్యక్రమం పర్యవేక్షణ లో భాగంగా సర్ కన్వీనర్ శ్రీ పోసాని గురునాధం ఆధ్వర్యంలో స్థానిక నియోజకవర్గ కార్యాలయం లో సమావేశంలో జిల్లా అద్యక్షులు అడ్డూరి శ్రీరామ్ పరిశీలించి సూచనలు చేశారు. చనిపోయిన వారు,ఊరు వదిలి వెళ్ళిన వారు అక్రమ వలసదారులు లాంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ పిట్టల గోవిందు జిల్లా కార్యదర్శి పోరుగండి నరసింహారావు తదితరులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కటుకూరు సుందర్రావు పట్టణాధ్యక్షుడు మునగంటి కామేశ్వర్రావు చందర్లపాడు మండల అధ్యక్షుడు గుత్తా బాలకృష్ణ నందిగామ రూరల్ అధ్యక్షుడు ఘంటా వెంకట్రావు ప్రధాన కార్యదర్శి కృష్ణ విజయ్ రాఘవేంద్ర సీనియర్ నాయకులు కోవిసి మచ్చ జిల్లా కార్యదర్శి శ్రీ తల్లికొండ సీతారామయ్య శ్రీ కేదార్నాథ్ సాంబశివరావు గోనెల సత్యనారాయణ రావూరి రమేష్,మహిళా మోర్చ నాయకురాలు రమాదేవి రోజా రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

# దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి



సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు , జూన్ 18: (మనం న్యూస్ ప్రతినిధి): ఆరోగ్యకరమైన జీవన శైలిపై యోగా సాధన ద్వారా అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. యోగా ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం చౌడవరంలోని ఆర్ వీ ఆర్ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులతో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ దైనందిత జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకుంటే అనారోగ్య సమస్యలు దరి చేరవని ,సంపూర్ణ ఆరోగ్యం సొంత మవుతుందన్నారు. యోగాను మన పూర్వీకులు అందించిన సాంస్కృతిక వారసత్వంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ వీ ఆర్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించిన నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ యోగాను తమ దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు యోగాను ఆచరిస్తున్న క్రమంలో ప్రతి సంవత్సరం జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.యోగా సాధనలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గుంటూరు నటరాజ్ అకాడమీ యోగా గురువు విజయ గౌరీ నేతృత్వంలో సూర్యమంత్రంతో సూర్య నమస్కారాలు ,యోగా ద్వారా సమతుల్య ఆహారాన్ని ఎలా తీసుకోవాలి అనే అంశాన్ని నృత్య ప్రదర్శన ప్రదర్శించారు.ఆయుష్ శాఖ యోగా ఇన్స్ట్రక్టర్ వెంకటేష్ కార్యక్రమంలో పాల్గొన్న వారిచే యోగాభ్యాసాలు చేయించారు. అనంతరం కళాశాల యాజమా న్యం జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జీయంసీకమీషనర్ మయూర్ అశోక్ ,యోగా గురువు విజయ గౌరీ ,యోగా ఇన్స్ట్రక్టర్ వెంకటేష్ లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. విజయలక్ష్మీ , ఆర్ వి ఆర్ జేసి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంటు రాయపాటి గోపాల కృష్ణ, ప్రిన్సిపల్ డా. కొల్లా శ్రీనివాస్ , ఆర్ అండ్ డి డైరెక్టర్ డా. కే. రవీంద్ర , కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డా.యన్ .వి. శ్రీనివాస్, గుంటూరు రూరల్ మండల తహసీల్దార్ మురళి , విద్యార్థులు పాల్గొన్నారు.





# జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ గొరిజవోలు దుర్గాప్రసాద్ నియామకం



గుంటూరు, జూన్ 18: గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్గా డాక్టర్ గొరిజవోలు దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం గుంటూరు మెడికల్ కాలేజ్, జీజీహెచ్లో రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతిగా సేవలందిస్తున్నారు. ఆయనకు వైద్య, విద్యా, పరిపాలనా రంగాల్లో 25 సంవత్సరాలకు పైగా విశేష అనుభవం ఉంది.ప్రభుత్వ వైద్యరంగంలో సేవలందిస్తూ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ వైద్య సేవల అమలు, వైద్య విద్యాభివృద్ధిలో డాక్టర్ దుర్గాప్రసాద్ కీలక పాత్ర పోషించారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో రేడియేషన్ ఆంకాలజీ విభాగాన్ని స్థాపించడంతో పాటు, గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఈ-హాస్పిటల్ సేవలు, జాతీయ క్యాన్సర్ గ్రిడ్ సేవల అమలుకు నాయకత్వం వహించారు.అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఆరోగ్య సంస్థలతో సమన్వయం చేస్తూ క్యాన్సర్ చికిత్స, ప్యాలియేటివ్ కేర్ సేవల విస్తరణకు కృషి చేసిన ఆయన, వైద్య సేవల ఆధునీకరణకు విశేషంగా తోడ్పడ్డారు.డాక్టర్ దుర్గాప్రసాద్ నియామకాన్ని వైద్యులు, సిబ్బంది, ప్రజారోగ్య రంగానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడటంతో పాటు, రోగులకు నాణ్యమైన చికిత్స అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉప ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ

గుంటూరు, జూన్ 18: (మనం న్యూస్ ప్రతినిధి): మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో ఈ నెల 19 వ తేదిన నిర్వహించనున్న 'అరణ్యారామం' శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పర్యావరణ, అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ మంత్రి కొణిదల పవన్ పాల్గొంటున్నందున ఇందుకు సంబంధించి ఏర్పాట్లను గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ,జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొంటున్నందున కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్ ,త్రాగునీరు తదితర ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డి ఎఫ్ ఓ హిమ శైలజ అధికారులు పాల్గొన్నారు.



# రాజకీయ పార్టీల ప్రతినిధులు సర్ ప్రక్రియ పై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు



గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 18 (మనం న్యూస్ ప్రతినిధి): రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ పై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని నగర కమిషనర్,తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కె.మయూర్ అశోక్ తెలిపారు.గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా ప్రతిపాదన పై మరియు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పై నగరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రతిపాదిత నూతన పోలింగ్ స్టేషన్ల పై సూచనలు, అభ్యంతరాల పై చర్చించి, అనంతరం సర్ పై మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల మేరకు గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు జరుగుతుందన్నారు.ఈ ప్రక్రియ నిర్వహించుట వలన కొంతమంది ప్రజలు మరియు రాజకీయ పార్టీల వారు తమ ఓట్లు తొలగిపోతాయని అపోహలు చెందుతున్నారని, ప్రజలు రాజకీయ పార్టీల ప్రతినిధులు అటువంటి అపోహలు చెందకుండా ఇంటికి వచ్చిన బిఎల్ఓలకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ సర్ ప్రక్రియలో భాగంగా 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రస్తుత జాబితాతో క్షుణ్ణంగా పరిశీలిస్తారని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్నవారిని గుర్తించడంతో పాటు, పాత జాబితాలో ఉండి ప్రస్తుతం అక్కడ లేని వారి వివరాలను సేకరిస్తారన్నారు. సర్వే సమయంలో బీఎల్ఓలు ఇచ్చే రెండు ఫారాలను పూర్తి చేసి, ప్రజలు వారికి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎలాంటి లోపాలు లేకుండా సిబ్బంది సర్వే చేస్తున్నారని,లాక్ చేసి ఉన్న ఇళ్లను మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు. రానున్న శనివారం బిఎల్ఓ, బిఎల్ఏ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కావున రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కాకుండా బీఎల్ఓలకు తగిన సమాచారం ఇచ్చి ఈ ఓటర్ల జాబితా సవరణను విజయవంతం చేయాలని కోరారు.అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను వెల్లడించగా వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం నందు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్, వెస్ట్ ఏఈఆర్ఓ సి.హెచ్ శ్రీనివాస్, డిటి నాగమల్లేశ్వరావు, ఆమ్ఆద్మీ సేవ కుమార్, బియస్పి వాసు, బిజెపి రామకృష్ణ, సిపియం నళినికాంత్, కాంగ్రెస్ జానీ బాషా, టిడిపి ఓంకార్,సతీష్, వైస్సార్సీపీ జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్‌కు సహకరించండి



**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 18 (మనం న్యూస్ ప్రతినిధి)**: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ఈనెల 15 నుంచి జూలై 14 వరకు జరుగుతుందని, బిఎల్ఓలు ప్రతి ఇంటికీ వచ్చి చేసే సర్వే ప్రక్రియకు నగర ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించి, సరైన సమాచారం అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరుకు బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారని, ఓటర్ల నుండి పూర్తిగా నింపబడిన ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించి ఆన్లైన్ ద్వారా డిజిటలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062, ఓటర్లలో 60,332 ఫారాలు పంపిణీ చేయబడి (23.94%), 346 డిజిటలైజ్ చేయబడ్డాయని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78,555 ఓటర్లలో 52,609 ఫారాలు పంపిణీ చేయబడి (18.89%), 393 డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకొని, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు త్వరితగతిన అందజేసి, సరైన, తప్పులులేని ఓటరు జాబితా తయారీకి ప్రతి ఓటరు సహకరించాలని కోరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సర్ విధులు కేటాయించబడిన బిఎల్ఓలు పి.సాయి శ్రీకాంత్ (పిఎస్ 54), పి.దుర్గా ప్రసాద్ (పిఎస్ 234), బి.మహేష్ బాబు (పిఎస్ 250) కేటాయింపు ఉత్తర్వులు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ వారిని విధుల నుండి సస్పెండ్ చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ జి.సాంబశివరావుని ఆదేశించగా, ఆయన సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**గుంటూరు, బ్రాడీపేట జూన్ 18: (మనం న్యూస్ ప్రతినిధి)**: గుంటూరు నగరంలోని బ్రాడీపేటలో ఉన్న సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం కార్యాలయంలో ఫోరం అధ్యక్షులు రాజపుత్ర సత్యం సింగ్ ఆధ్వర్యంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలవాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు రాజపుత్ర సత్యం సింగ్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. బ్రిటీష్ పాలకులకు ఎదురు నిలిచి అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఆమె దేశ మహిళలకు ఆదర్శప్రాయురాలు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలి. రాణి లక్ష్మీబాయి చూపిన దేశభక్తి, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి ప్రతి భారతీయుడికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆమె వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తూ,ఆమె ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిస్తున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొణిదే మోహన్ గోపి కృష్ణ,దోవ లక్ష్మయ్య, దాసరి జాన్ బాబు,అతోట జోసేఫ్, నలక గోపి,అంజి బాబు తదితరులు పాల్గొని ఝాన్సీ రాణి లక్ష్మీబాయికి ఘన నివాళులు అర్పించారు.

# క్యాన్సర్ బాధితులకు కొత్త ఆశలు



- **ఆధునిక విధానాలతో మెరుగైన ఫలితాలు**
- **డాక్టర్ మధుకర్**

**గాంధీనగర్ జూన్ 18 మనం న్యూస్** : క్యాన్సర్ చికిత్స రంగంలో ఆధునిక వైద్య సాంకేతికతలు, నూతన చికిత్సా విధానాలు రోగులకు మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయని యశోద ఆసుపత్రి, సోమాజిగూడ యూనిట్కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎస్. మధుకర్ తెలిపారు. విజయవాడలో గురువారం నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం క్యాన్సర్ను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశాలు పెరిగాయని, దీంతో చికిత్స మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నామని చెప్పారు. టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ, ప్రెసిషన్ ఆంకాలజీ వంటి ఆధునిక చికిత్సా విధానాలు రోగుల కోలుకునే అవకాశాలను పెంచుతున్నాయని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి స్వభావం, జన్యుపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని వ్యక్తిగతీకరించిన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. రక్త సంబంధిత క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లకు యశోద ఆసుపత్రిలో ఆధునిక చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సు ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి సమర్థవంతంగా చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ మధుకర్ సర్జికల్ ఆంకలోజిస్ట్ విజయవాడ బెస్ట్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ప్రతి నెల 3వ గురువారం అందుబాటులో ఉంటారు. ఈ సమావేశంలో డాక్టర్ బొల్లు శ్రీ తేజ మేడమ్, యశోద ఆసుపత్రి మార్కెటింగ్ విభాగం ఏజీఎం వెంకటేశ్వరరావు వీరంకి, మార్కెటింగ్ మేనేజర్ రెంటాలా విజయ్ కుమార్, ఎస్.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పదవులకు అతీతంగా సేవా ప్రోత్సాహం ఉండాలి



**గాంధీనగర్ జూన్ 18 మనం న్యూస్**: లయన్స్ అనగానే సేవా దృక్పథంతో సాగుతారు అని చెప్పుకోవాలి, పదవుల హోదా సేవోన్నతికి ప్రోత్సాహకరం గా ఉండాలి అని ఎల్ సి ఐ ఎఫ్ ఏరియా లీడర్ అంబటి సుధాకర్ రెడ్డి అన్నారు. హోటల్ మమత కాన్ఫరెన్స్ హాలు లో లయన్స్ క్లబ్ విజయవాడ వారి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరుగగా సుధాకర రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యవర్గం తో ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు తెలిపారు. లయన్స్ జిల్లా చైర్మన్ వేముల హజరత్తయ్య గుప్తా కార్యక్రమం నిర్వహిస్తూ సేవలే క్లబ్బులను ఎక్కువ కాలం మన్నిక గా నిలుపుతాయని, క్రమశిక్షణ తో భాద్యతాయుతంగా పదవులకు వన్నె తెచ్చుకునేలా నిర్మాణాత్మకంగా సమర్థంగా సాగాలని సూచించారు. మాజీ గవర్నర్ దుర్గా మల్లేశ్వర రావు విజయవాడ క్లబ్ యొక్క విశేషాలను తెలిపి ఆ గొప్ప తనం తగ్గకుండా చూసుకోవాలని కోరారు. నూతన అధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు , కార్యదర్శిగా కె. గణేష్, కోశాధికారి గా టి ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేయగా , రవీంద్రకువమార్, రమేష్, ముత్యప్రసాద్, పాలెడ్డి, చక్రధర్, రాంకుమార్, శోభన్ కుమార్, కృష్ణమూర్తి పాల్గొనగా పద్మభూషణ్ అధ్యక్షత వహించారు.

# చలో విజయవాడను విజయవంతం చేయాలి



**గుంటూరు జూన్ 18 (మనం న్యూస్ ప్రతినిధి)**: రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్కుమార్ పిలుపునిచ్చారు.గురువారం గుంటూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,రైతుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపడుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది రైతులు హాజరుకావాలని కోరారు.చలో విజయవాడ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని,పార్టీ నాయకులు,కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అజయ్కుమార్ విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# సాయికృష్ణ ఘటనపై సీబీఐ విచారణ జరపాలి

- **అంబటి రాంబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ నేతలు**



**విజయవాడ, జూన్ 18( మనం న్యూస్ )**: గాదె సాయికృష్ణ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణుతో కలిసి పరామర్శించారు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ సాయికృష్ణ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని అన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులను ఇలాంటి విషాద సమయంలో పరామర్శించడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటన ద్వారా రాష్ట్రంలోని వ్యవస్థలు ఎంత దారుణంగా పనిచేస్తున్నాయో బయటపడిందన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన తర్వాత హృదయ విదారకమైన విషయాలు తెలిసాయని చెప్పారు.సాయికృష్ణ తల్లి ఫోన్ను స్వాధీనం చేసుకుని, ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడిని గుర్తించి తీసుకువచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. సాయికృష్ణను విడిచిపెట్టాలని సీఐని కుటుంబ సభ్యులు ఎంతో ప్రాధేయపడ్డారని పేర్కొన్నారు.న్యాయవాద వృత్తిలో ఉన్న దుర్గ డీజీపీకి ఫిర్యాదు చేసినప్పటికీ, ఆ ఫిర్యాదు డీజీపీ నుంచి సీపీ, అక్కడి నుంచి డీసీపీ కార్యాలయానికి చేరి చివరకు నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. పోలీస్ స్టేషన్లో ఉన్న ఇతర నిందితుల ద్వారా సాయికృష్ణను హత్య చేశారనే విషయం తెలిసిందన్నారు.హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయకుండా అనేక అవరోధాలు సృష్టించారని ఆరోపించారు. సాయికృష్ణకు నేర చరిత్ర ఉందని ప్రచారం చేస్తున్నారని, అది నిజమైతే అతని తల్లి గుడిసెలో నివసిస్తూ రోజువారీ కూలి పనులు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.ఉగ్రవాది అజ్మల్ కసబ్కు చట్టపరమైన అవకాశాలు కల్పించారని, అలాంటి చట్టాలు సాయికృష్ణ విషయంలో ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించుకునే అవకాశం కూడా కుటుంబ సభ్యులకు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. బాధితులు తమ పార్టీకి చెందినవారు కాకపోయినా, ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సాయికృష్ణను హత్య చేయడమే కాకుండా, ఆధారాలను కూడా మాయం చేశారని ఆరోపించిన అంబటి రాంబాబు, ఈ వ్యవహారంలో కానిస్టేబుల్ నుంచి సీపీ స్థాయి వరకు అందరి పాత్రపై విచారణ జరగాలని కోరారు. పౌరహక్కుల సంఘాలు ఈ ఘటనపై ముందుకు వచ్చి ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సీపీకీ, డీజీపీకీ, హోంమంత్రికీ తెలియకుండా ఇలాంటి ఘటన జరగదని ఆరోపించిన ఆయన, ప్రభుత్వం తూతూ మంత్రంగా విచారణాధికారిని నియమించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ప్రభుత్వం దమ్ము, ధైర్యం ఉంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో సంక్షేమం - అభివృద్ధిలో గుంటూరు పశ్చిమకు రూ.500 కోట్ల పనులు




**▸▸ ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వ బలం**

**▸▸ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**▸▸ గుంటూరు జిల్లా ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయోత్సవ బహిరంగ సభకు వందలాది భారీ బైక్ ర్యాలీతో కదిలిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరు పశ్చిమ జూన్ 18 (మనం న్యూస్ ప్రతినిధి)ః ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ రెండేళ్లలో గుంటూరు పశ్చిమలోనే రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు, కాలువల్లో పూడిక తీత పనులు, ట్రాఫిక్ నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.500 కోట్లకు పైగా పనులు పూర్తిచేశామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా గుంటూరు జిల్లా విజయోత్సవ బహిరంగ సభకు ముందు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి. ఆధ్వర్యంలో శ్రీనివాసరావుపేట టీడీపీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 600కు పైగా ద్విచక్ర వాహనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పై ప్రజలు ఉంచిన నమ్మకమే రెండేళ్లుగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగడానికి కారణమని, గత ఐదేళ్లలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, అరాచకాలను గుర్తుచేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు ఇచ్చిన తీర్పును కూటమి ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే సుమారు 20 వేల మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.9 కోట్లకు పైగా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. అలాగే మూడు అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజూ దాదాపు 9 వేల మంది పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి పేదల ఆకలి తీర్చడం కూటమి ప్రభుత్వ గొప్ప నిర్ణయమన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గుంటూరు పశ్చిమలోనే రూ.8 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద పార్టీ, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి అర్హ కుటుంబానికి లబ్ధి చేకూరుస్తూ ఒక్క పశ్చిమ నియోజకవర్గంలోనే రూ.32 కోట్ల మేర ప్రయోజనం కల్పించామన్నారు.దీపం పథకం ద్వారా రూ.21 కోట్లకు పైగా లబ్ధి ప్రజలకు అందుతోందని వెల్లడించారు.కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), నార్ల ఆడిటోరియం, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర కీలక ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి కూడా వైసీపీ నాయకులు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. చిన్న చిన్న లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందని, అమరావతి, పోలవరం వంటి రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన ప్రాజెక్టులకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కూటమి నాయకులు ఇదే ఐకమత్యంతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని కోరారు.



# 20న ఉండవల్లి గుహల వద్ద ముఖ్యమంత్రి యోగా

గుంటూరు, జూన్ 18 : (మనం న్యూస్ ప్రతినిధి)ః ఉండవల్లి గుహల వద్ద ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న యోగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నారు.ఈ మేరకు గురువారం పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్,యోగా నిపుణులుతో కలిసి జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పరిశీలించారు.అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు.బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని చెప్పారు.యోగ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు.వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు,డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి,జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్,ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తదితరులు పాల్గొన్నారు.



### మున్సిపల్ కార్మికుల సమస్యల

# పరిష్కారానికి దశలవారీ ఆందోళనలు

**▸▸ కోట మాల్యాద్రి**

గుంటూరు జోన్ 18 (మనం న్యూస్ ప్రతినిధి)ః ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (అఐట్యూఇ) గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి కోటా మాల్యాద్రి మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్ లో యూనియన్ నగర అధ్యక్షుడు కోటి వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు, గ్రాట్యుటీ అమలు, క్షఇ ఏర్పాటు, 30% మధ్యంతర భృతి, బకాయిల చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే ఎ..ఖ్రూా.25 ప్రకారం మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, స్కూల్ స్వీపర్లు, పార్కు కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.స్వీపింగ్ మిషన్ల వినియోగం వల్ల అధిక ఖర్చులు అవుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో వాటి స్థానంలో స్థానికంగా కార్మికులను నియమించి పనులు చేయించాలని ఆయన సూచించారు.అలాగే ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని,థర్డ్ పార్టీ కాంట్రాక్టింగ్ విధానాన్ని రద్దు చేయాలని, హైకోర్టు తీర్పు మేరకు ఒప్పంద కార్మికులను రెగ్యులర్ చేయాలని, డైలీ వేజ్ కార్మికులను ఆప్కాస్లో చేర్చాలని మాల్యాద్రి డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 20న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, జూన్ 22న స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాల సమర్పణ,జూన్ 24న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం జూలై 7న రాష్ట్రవ్యాప్తంగా 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోట మాల్యాద్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారులు చినిపోతుల వెంకటరావు, కోశాధికారి బెజవాడ శాంసన్, సద్గుణ రావు సిహెచ్ నారాయణ మిర్యాల కోటేశ్వరరావు,చల్ల మరియాదాసు, శ్రీనివాసరావు మేకల, చిర్రా ఏసుదాసు, దాసరి శివయ్య,కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ఆసియా కప్ కాంస్య విజేత గీతశ్రీకి ఘన సన్మానం



**▸▸ శాప్ తరపున ప్రోత్సాహకాలు త్వరలో అందజేస్తాం: రవి నాయుడు**

విజయవాడ తూర్పు జూన్ 18 (మనం న్యూస్)ః జపాన్లో ఇటీవల నిర్వహించిన మహిళల అండర్-18 హాకీ ఆసియా కప్ పోటీల్లో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్కు చెందిన అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి నమ్మి గీతశ్రీని శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందించారు. గురువారం శాప్ ప్రధాన కార్యాలయంలో ఆయనను గీతశ్రీ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గీతశ్రీని శాలువాతో సత్కరించిన రవి నాయుడు, అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టులో స్థానం సంపాదించి దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడం ప్రతి ఆంధ్రప్రదేశ్ వాసికి గర్వకారణమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే క్రమశిక్షణ, కఠోర శ్రమ, అంకితభావంతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమన్నారు. మహిళల హాకీలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు గీతశ్రీ వంటి యువ క్రీడాకారిణులు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. భవిష్యత్తులో జరగనున్న జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి పతకాలు అందించాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, శాప్ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని రవి నాయుడు స్పష్టం చేశారు. శాప్ తరపున గీతశ్రీకి అందాల్సిన ప్రోత్సాహకాలు, నగదు బహుమతులను త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు.

# పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

**కలెక్టర్ డీకే బాలాజీ..**



**పామర్రు, జూన్ 18 ( మనం న్యూస్ ):**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహింపబడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)తో పాటు, రెవెన్యూ సమస్యల త్వరితగతిన పరిష్కారం కోసం నియోజవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలోని ఆరేపల్లి కళ్యాణ మండపం నందు నేడు 19వ తేదీ శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించను న్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పిజిఆర్ఎస్ లో గతంలో వచ్చిన అర్జీల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హాజరు కానున్నారన్నారు.నియోజవర్గ లోని అన్ని మండలాలకు చెందిన అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

# సాయికృష్ణ కేసులో నిజాలు వెలికితీయాలంటే జ్యుడీషియల్ విచారణే మార్గం

**పోలీసు అధికారులపై హత్య కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ డిమాండ్**



**విజయవాడ సెంట్రల్, జూన్ 18 (మనం న్యూస్):** కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన గాదె సాయికృష్ణ ఘటనలో పూర్తి స్థాయి జ్యుడీషియల్ విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు, అడ్మినిస్ట్రేషన్ ఇన్చార్జ్ కొలనుకొండ శివాజీ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం కొంత ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టినప్పటికీ, నిజమైన న్యాయం జరగాలంటే జ్యుడీషియల్ ఎంక్వయిరీ తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ఘటనకు కారణమైన సీఐని సస్పెండ్ చేయడం, సీనియర్ ఐఏఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడం సరిపోదని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి హత్య కేసు కింద దర్యాప్తు చేపట్టాలని కోరారు.కేసులో నిర్లక్ష్యం ప్రదర్శించిన పోలీసు అధికారులు, సిబ్బందిపై హత్య కేసులు నమోదు చేసి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులపై వచ్చిన ఆరోపణలను అదే శాఖ విచారిస్తే న్యాయం జరగదని, స్వతంత్ర విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. బాధితుడి తల్లి నెల రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లభించలేదని, సాయికృష్ణ కోసం పది ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పిన పోలీసులు ప్రజలను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. ఈ కేసును కుల కోణంలోకి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శిం చారు.ప్రభుత్వం వెంటనే సిట్టింగ్ జడ్జి లేదా మేజిస్ట్రేట్తో జ్యుడీషియల్ ఎంక్వయిరీ ఏర్పాటు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించాలని కోరారు. ఘటనకు బాధ్యులైన పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీ, సీఐతో పాటు సంబంధిత కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.అమాయక ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పోలీసు వ్యవస్థపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరమని పేర్కొన్న శివాజీ, గాదె సాయికృష్ణ కుటుంబానికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనది

**బూత్ లెవెల్ అధికారి కంఠమనేని పల్లవి**



**పామర్రు,జూన్ 18 ( మనం న్యూస్):** నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలో పలు బూతులలో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం జోరుగా సాగుతుంది. ఇందులో భాగంగా సచివాలయ ఉద్యోగులు అయిన (బిఎల్వోలు )వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఇంటిఇంటికి తిరుగుతూ ఓటర్లకు అవసరమైన ఫారాలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా148 బూతు బి ఎల్ ఓ కంఠమనేని పల్లవి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పూర్తి వివరాలను అందించి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేొదుకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనది అని జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఓటర్ల అందరపైన ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బిఎల్వోలు నేరుసు నరేష్, కాశి నాద్, హుస్సేన్, మమత సహాయకురాలుగా ఎమ్మెస్ కే రాజేశ్వరి , వైసిపి, టీడీపీ కూటమి నేతలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# భారత మార్కెట్లోకి రెడ్మీ టర్బో 5




**గాంధీనగర్ జూన్ 18 మనం న్యూస్:** భారతదేశంలోని నవతరం పవర్ యుాజర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని షావోమీ ఇండియా 'రెడ్మీ టర్బో 5' స్మార్ట్ఫోన్ను విడుదల చేసింది. అత్యాధునిక ఫీచర్లు, భారీ బ్యాటరీ, శక్తివంతమైన ప్రాసెసర్, ప్రీమియం డిజైన్తో ఈ ఫోన్ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. మీడియాటెక్ డైమెన్సిటీ 8500 అల్ట్రా చిప్సెట్, ఎల్పీడీడీఆర్5ఎక్స్ అల్ట్రా మెమరీ, యుాఎఫ్ఎస్ 4.1 స్టోరేజ్తో కూడిన ఈ పరికరం వేగవంతమైన పనితీరును అందిస్తుందని సంస్థ తెలిపింది. రెడ్మీ టర్బో 5లో 7540 ఎంఏహెచ్ భారీ బ్యాటరీని అందించగా, 100 వాట్ హైపర్చార్జ్ సదుపాయం ద్వారా కేవలం 30 నిమిషాల్లోనే 51 శాతం వరకు ఛార్జింగ్ సాధ్యమవుతుందని పేర్కొంది. అలాగే 27 వాట్ రివర్స్ ఛార్జింగ్ ఫీచర్ కూడా అందుబాటులో ఉంది. ఫోటోగ్రఫీ కోసం ఓఐఎస్, ఈఐఎస్ మద్దతుతో 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 ప్రధాన కెమెరాను ఏర్పాటు చేశారు. 4కె 60ఎఫ్పీఎస్ వీడియో రికార్డింగ్, ఏఐ ఆధారిత ఎడిటింగ్ టూల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. 6.59 అంగుళాల 1.5కె అమోలెడ్ డిస్ప్లే, 120 హెర్జ్ రిఫ్రెష్ రేట్, డాల్బీ విజన్, డాల్బీ అట్మాస్ మద్దతుతో వినోద అనుభూతిని మరింత మెరుగుపరిచారు. షావోమీ హైపర్ ఓఎస్ 3 ఆధారంగా పనిచేసే ఈ ఫోన్కు నాలుగేళ్ల ఆండ్రాయిడ్ అప్గ్రేడ్లు, ఆరేళ్ల సెక్యూరిటీ అప్డేట్లు అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. రెడ్మీ టర్బో 5 జూన్ 19 నుంచి, రెడ్మీ డాట్ కాం, అమెజాన్, షావోమీ రిటైల్ స్టోర్లలో విక్రయానికి అందుబాటులోకి రానుంది.

# రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి

**'4.50 లక్షల ఇళ్ల పూర్తి - మరో 4 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో**

**'పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం**

**రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి**




**(అమరావతి,పి.మీరాహుస్సేన్ ఖాన్, మనం ప్రత్యేక ప్రతినిధి):** రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి లభించిందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించగా, మరో 4 లక్షల గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం గృహ నిర్మాణ రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు. పేదల గృహ భద్రత, సామాజిక స్థిరత్వం, జీవన ప్రమాణాల మెరుగుదల ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచారం విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గృహ నిర్మాణ రంగంలో సాధించిన ప్రగతి, అమలులో ఉన్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ సమగ్ర వివరాలు వెల్లడించారు.

సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబం కల మాత్రమే కాకుండా ఆర్థిక భద్రతకు, సామాజిక గౌరవానికి, కుటుంబ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు ప్రారంభించిన పేదల గృహ సంక్షేమ దృక్పథాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరింత విస్తృత స్థాయిలో అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, కొత్తగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏఒక్క అర్హత కుటుంబం కూడా గృహం లేకుండా ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## 2014-2019లో చారిత్రాత్మక గృహ నిర్మాణ కార్యక్రమం

2014-19 కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని పేదల సంక్షేమ కార్యక్రమాల్లో అత్యున్నత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, ప్రతి అర్హత గల కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో విస్తృత స్థాయిలో గృహ నిర్మాణ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గృహ నిర్మాణ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వ సహాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గణనీయమైన ఆర్థిక వనరులను సమకూర్చి పేదలకు నాణ్యమైన గృహాలను అందించే దిశగా చర్యలు చేపట్టిందన్నారు.